క్లుప్తంగా

హత్యాయత్నానికి పాల్పడిన వారిని శిక్షించాలి

టెక్కలి: పాతపట్నంలో జర్నలిస్టు తిరుపతిరావుపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ టెక్కలిలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్వీ ఎస్ఎన్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు బెండి నరసింగరావు ఆధ్వర్యంలో వివిధ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డీఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈసీఈ సెకండియర్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఎడబ్ల్యూఎస్–క్లౌడ్ ఈజ్ ఎమర్జింట్ టెక్నాలజీ, వైడ్ రేంజ్ ఆఫ్ కంపెనీస్ యుటిలైజేషన్ ది సర్వీసెస్, క్లౌడ్ టెక్నాలజీ హేజ్ వేరియజ్ బెనిఫిట్స్ ఫర్ డవలపింగ్ ది అప్లికేషన్స్ వంటి అంశాలపై శిక్షణ అందజేస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు ఎంఐజీ ఫ్లాట్లకు డ్రా

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఐజీ ఫ్లాట్లకు సంబంధించి గురువారం ఉదయం 11 గంటలకు డ్రా నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు బుధవారం తెలిపారు. ఎన్టీఆర్ హౌసింగ్ కార్యక్రమంలో బొడ్డపాడు లే–అవుట్‌లో ఫేజ్–1కు సంబంధించి నిర్వహించే డ్రాకు దరఖాస్తుదారులంతా హాజరు కావాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్, సుడా చైర్మన్ శ్రీకాకుళం, పలాస ఎమ్మెల్యే హాజరవుతారన్నారు.

పీఎం కిసాన్‌కు దరఖాస్తు చేసుకోండి

కవిటి: రైతులంతా పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సోంపేట సబ్‌డివిజన్ ఏడీఏ పి.జగన్మోహనరావు అన్నారు. కమలాయి పుట్టుగలో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయంలో యాంత్రీకరణను పెంచేందుకు ఉద్దేశించి ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్లను అందించనున్నట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలను వివరించారు. సమావేశంలో ఏవో బడగల దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకుడు నెయ్యిల గణపతి ఉన్నారు.

రక్తదాన శిబిరం

కాశీబుగ్గ: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా పలాసలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 738 మంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్‌తో పాటు స్థానిక బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు రక్తదానం చేసిన వారిలో ఉన్నారు.

టెన్నికాయిట్ శిక్షణ శిబిరం ప్రారంభం

కాశీబుగ్గ: జాతీయ టెన్నికాయిట్ పోటీలకు వెళ్లే క్రీడాకారుల కోసం శిక్షణ శిబిరం పలాస క్రీడా మైదానంలో బుధవారం ప్రారంభమైంది. జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్, ఎస్.వి.జోగారావు దీన్ని ప్రారంభించారు. క్రీడాకారులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్రీడా ప్రోత్సాహకులు మల్లా భద్రయ్య, జె.మల్లేశ్వరరావు, రవిశంకర్ గుప్తా, కె.తారక్, కె.శంకరరావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పట్ట తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు ఉన్నారు.

ఎస్పీని కలిసిన మందస ఎస్ఐ



ఎస్పీ మహేశ్వరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణప్రసాద్

కాశీబుగ్గ: మందస ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కె.కృష్ణప్రసాద్ జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈయన శ్రీకాకుళంలోని సీసీఎస్ పోలీసు స్టేషన్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న ఎస్పీ కుటుంబ సభ్యులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి కుటుంబసభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ వేదపురోహితులతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రత్యేకతను వివరించారు. ఈ స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ ఉన్నారు.

అనంతపురంలో మహాయజ్ఞం

ఇచ్ఛాపురం రూరల్: సరిహద్దు అనంతపురం గ్రామంలో శివాలయం ప్రతిష్ఠ సందర్భంగా మహా యజ్ఞాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు యజ్ఞాన్ని దర్శించుకున్నారు.



మిల్లు వద్ద ధాన్యం బస్తాలు

కళ్ల ముందే ధాన్యం!

- కొనుగోలు చేయని అధికారులు
- ఆందోళన చెందుతున్న అన్నదాత
- ఆర్ఎస్‌కేలు, మిల్లుల వద్ద గుట్టలుగా ధాన్యం బస్తాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- దళారుల ప్రవేశంతో దోపిడీకి గురౌతున్న రైతులు



గోకర్ణపురం రైతు సేవా కేంద్రం వద్ద గుట్టలుగా ధాన్యం బస్తాలు

కంచిలి:

ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే**నాథుడే** లేకుండా పోయాడు. కళ్ల ముందే ధాన్యం **బస్తాలు** ఉన్నా.. కొనుగోలుకు ఎవరూ ఆసక్తి చూప**కపోవడం**తో అన్న దాత ఆందోళన చెందుతున్నాడు. **ఎంతో** శ్రమించి సాగుచేసిన పంట చేతికొచ్చిన తర్వాత దాన్ని కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోవడంతో ఏం చేయాలో పాలుపోక దిగాలు చెందుతున్నా రు. తమ ఉత్పత్తులను పోగులుగా పోసి, ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని ఎదురుతెన్నులు చూస్తున్నా రు. రైతు సేవాకేంద్రాల చుట్టూ తిరుగుతూ తమ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారుల కాళ్లవేళ్లా పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు కష్టాలు కోకొల్లలుగా మారాయని తీవ్రంగా విమర్శిస్తున్నారు. రోజులకొద్దీ ధాన్యం నిల్వలు కళ్లముందే కదలకుండా ఉండిపోవడంతో బెంగపడాల్సి వస్తోంది. ప్రభుత్వాలు అవలంబిస్తు న్న విధానం వలన భవిష్యత్ తరాలు వ్యవసాయం చేయాలంటనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తా మని చెప్పి అధికారం చేపట్టిన పాలకులు ప్రస్తుత తరుణంలో ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. కంచిలి మండల పరిధిలో రైతుభరోసా కేంద్రాల లెక్కల ప్రకారం 18 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని.. వాటిని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉందని నివేదిక ఇచ్చారు. కానీ సివిల్ సప్లయీస్ విభాగం మాత్రం 11,600 **మెట్రిక్** టన్ను లు **కొనుగోలు** చేయాల్సి **ఉండగా,** ఇప్పటివ**రకు 6,500 మెట్రిక్** టన్నులు **మాత్రమే కొనుగోలు చేశారు.** సివిల్ సప్లయీస్ అధికారుల లెక్కల ప్రకా రం మరో 5,100 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉండగా, వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 11,500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ సుమారు నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా మందగించాయని రైతులు **వాపోతున్నారు. రైతు సేవా కేంద్రాలు,** మిల్లులు, గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్ద ధాన్యం బస్తాలు కుప్పలు తెప్పలుగా పోగులు ఏర్పడ్డాయి. వీటిని చూస్తూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

దళారుల రంగ ప్రవేశం

రైతులు తమ ధాన్యం నిల్వలు ప్రభుత్వం కొనుగోలు చేయటం లేదని దిగాలు చెందతుండగా, మరోవైపు దళారులు రంగ ప్రవేశం చేశారు. 80 కిలోల బస్తా ధాన్యాన్న రూ. 1600 నుంచి 1650 రూపాయలకు కొను**గో**లు చేస్తామని నిల్వ ఉండిపోయిన **రైతుల** వద్దకు వెళ్లి ఊరిస్తున్నారు. **ప్రభుత్వం** రూ. 1840కు కొనుగోలు **చేస్తుండగా**, దళారులు మాత్రం అంతకంటే **తక్కువకు** కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే **ఎంతో మంది రైతులు** తప్పని పరిస్థితుల్లో దళారులకే తమ ధాన్యాన్ని కట్టబెడుతున్నారు. ప్రభు త్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో తాము నష్టపోతున్నామని అన్నదాన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం



రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. కంచిలి మండలంలో ఇప్పటి వరకు 6,500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. మిగతావి కూడా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–పి.కూర్మారావు, డీఎస్‌డీటీ, సోంపేట

కూటమి ప్రభుత్వం వైఫల్యం




కూటమి ప్రభుత్వం రైతులను నమ్మించి కనబెట్టిట ముంచింది. మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పి పెద్ద పెద్ద ప్రకటనలిచ్చి, తీరా సగం సరకు కూడా కొనుగోలు చేయకుండా చేతులెత్తేశారు. ఇది ప్రభుత్వ వైఫల్యమే. ఇదెక్కడి న్యాయం. రైతుల కడుపుకొట్టినోళ్లు ఎన్నడూ బాగుపడలేదు. ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

–పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి

రణసప పాము హల్‌చల్

కాశీబుగ్గ: మందస మండలం బొగాబంద గ్రామంలో రణసప పాము బుధవారం హల్ చేసింది. గ్రామ సమీపంలో ఉన్న చెరువు రేవు వద్ద బంగారం, నల్లటి మచ్చలు కలిగిన పాము కనపడటంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. ఆత్మరక్షణ కోసం దాన్ని కర్రలతో కొట్టి హతమార్చారు. ఈ పాము కరిస్తే తక్షణమే మరణించకపోయినా కొద్ది రోజుల తరువాత శరీరంపై నల్ల, బంగారం రంగులో మచ్చలు వస్తాయని.. తరువాత శరీరం ముక్కలుగా రాలిపోతుందని స్థానికులు తెలిపారు.



హతమైన రణసప పాము

అత్యంత విషపూరిత జాతికి చెందిన ఈ పాముకు బ్యాండెడ్ క్రైట్ (బంగారస్ ఫాసియాటస్)అని శాస్త్రీయంగా పిలుస్తారని చెప్పారు.

ఎన్నికల విధుల సర్టిఫికెట్లు అందజేయాలి

టెక్కలి: సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు టి.చందనరావు, కె.కె.రామిరెడ్డి కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి బుధవారం వినతి పత్రం అందజేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో విధులు చేపట్టిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయలేదని పేర్కొన్నారు. టెక్కలి, పాతపట్నం, నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయ సిబ్బందికి తక్షణమే డ్యూటీ సర్టిఫికెట్లు అందజేసే విధంగా చొరవ చూపాలని కోరారు.



ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

సరిహద్దు రోడ్డును విస్తరించాలని వినతి

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి ఆంధ్రా–ఒడిశా జరడా రోడ్డు వెడల్పు చేయాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విజయవాడలోని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ నయిముల్లాను కలసి వినత పత్రం అందజేశారు. జరడా రోడ్డు ఆంధ్రప్రదేశ్ భూభాగం ప్రాంతంలో రోడ్డు వెడల్పు కోసం 2023లో సుమారు రూ. 820 కోట్లతో సంబంధిత పనులకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. బహుదానదిపై పాత వంతెన కూలిపోవడంతో ప్రస్తుతం తాత్కాలిక రోడ్డును వేశారని వివరించారు. శాశ్వత రోడ్డు కోసం గతంలో ప్రతిపాదనలు చేయడంతో టెండర్లను ఆహ్వానించినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో మరోమారు టెండర్ వేసి రోడ్డును నిర్మించాలని వినతి పత్రంలో కోరారు.



నయిముల్లాకు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

అంగన్‌వాడీ కేంద్రానికి 15 సెంట్ల భూమి వితరణ

- ఔదార్యంగా ఇచ్చిన ఎంపీపీ
- పనులు పూర్తి చేయని కూటమి ప్రభుత్వం

పలాస:

మండలంలోని మోదుగులపుట్టి లో అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ భర్త తన సొంత ఆస్తిలో గ్రామం మధ్యన ఉన్న 15 సెంట్ల స్థలాన్ని వితరణగా అందజేశారు. అంతే కాకుండా ఆ స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం కోసం ఎంపీపీ ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి రూ.12 లక్షలు నిధులను మంజూరు చేయించారు. ఈ పనులు 2023లో ప్రారంభమై శరవేగంతో సాగాయి. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఒక చిన్న గుడిసెలో కొనసాగుతోంది. ఆ గ్రామ సచివాలయం ఇంజినీరు తులసీరాం మాట్లాడుతూ నిధులు గత ప్రభుత్వం హయాంలో దశల వారీగా విడుదలయ్యాయని, ఆ తర్వాత నిధులు పెండింగులో పడ్డాయని, అందుకే భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయని చెప్పారు. ఏది ఏమైనా లక్షల రూపాయల ఖరీదైన భూమిని అంగన్‌వాడీ కేంద్రం కోసం ఇచ్చామని, వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీపీ ప్రవీణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ ఊరులో పూరిగుడిసెలో అంగన్‌వాడీ కేంద్రం అన్న అపవాదు నుంచి బయటకు తీసుకురావాలని అధికారులను కోరారు.



అర్ధంతరంగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం భవనం పనులు

నేటినుంచి పీఎం ఇంటర్న్‌షిప్‌కు మెగాడ్రైవ్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కోసం రెండు రోజులు మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ బుధవారం తెలిపారు. 21 నుంచి 24 ఏళ్ల యువతీ యువకులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హతలు తెలియజేసే ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్‌నంబర్, మెయిల్ ఐడీతో మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

15వ తేదీలోగా రుణాలు చెల్లించాలి

సోంపేట: సోంపేట ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ద్వారా రైతులు తీసుకున్న స్వల్పకాలిక రుణాలను ఫిబ్రవరి 15వ తేదీలోగా చెల్లించాలని పీఏసీఎస్ సీఈవో నారాయణరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడువులోగా చెల్లించకపోతే అధిక వడ్డీతో రుణాలు చెల్లించాల్సి వస్తుందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ: ఆడపిల్లలు తెలియని వ్యక్తుల మాటలు విని మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్‌పీఎఫ్ అధికారి మణిగాం కరువులు అన్నారు. అత్యవసర సమయంలో 1098 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ మేరకు పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో 1098 కాల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ బి.ఎం.బిసై, జీఆర్పీ కానిస్టేబుళ్లు కీలు భానుమతి, బి.శ్రీనివాసరావు, చైల్డ్‌లైన్ హెల్ప్‌డెస్క్ సూపర్‌వైజర్ ఆర్.జాస్మిన్‌కుమారి ఉన్నారు.

ఉచిత కాలేయ వైద్య శిబిరం

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం కూడలి వద్ద జేసీఐ స్వచ్ఛందసంస్థ, ఏఆర్ఎస్ క్లినిక్ సంయుక్తంగా ఉచిత కాలేయ ఆరోగ్య వైద్య శిబిరాన్ని బుధవాం నిర్వహించారు. వైద్యులు టి.వి.ప్రదీప్ 105 మందికి కాలేయ పరీక్షలు నిర్వహించారు. జేసీఐ అధ్యక్ష, కార్యదర్శులు కె.జయదేవ్, డాక్టర్ మోహన్‌వెంకటేష్, టి.షణ్ముఖరావు, సంతోష్, శ్రావణ్, స్వరూప్ పాల్గొన్నారు.

భారీ వాహనాలను నియంత్రించాలని విజ్ఞప్తి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలలోకి వస్తున్న భారీ వాహనాల ప్రవేశంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తక్షణమే వాటిని నియంత్రించాలని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. భారీ లారీల రాకతో విద్యుత్ తీగలు తగిలి మంటలు రేగిన సందర్భాలు ఉన్నాయని, తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని కమిషనర్‌కు వివరించారు. వినతి పత్రం అందజేసినవారిలో 20వవార్డుకు చెందిన అంబటి ఆనందరావు, గజ్జి బాలయ్య తదితరులున్నారు.

‘ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దు’

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం వద్దని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణరావు కోరారు. ఆరేళ్ల క్రితం సంభవించిన తిత్లీ తుఫాన్‌తో ఉద్దాన ప్రాంతంలో జీడి, మామిడి, పనస, మునగ తోటలను నష్టపోయి రైతులు అవస్థలు ఎదుర్కొంటుండగా.. ఇప్పుడు కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో 1394 ఎకరాల భూమిని రైతుల నుంచి తీసుకుంటే వారు ఉపాధిని కోల్పోతారన్నారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న రాంపురం, బేతాళపురం, చీపురపల్లి పంచాయతీల పరిధిలో మూడు రెవెన్యూ డివిజన్లలోని పదహారు గ్రామాల ప్రజల జీవన మనుగడ అగమ్యగోచరంగా మారుతోందన్నారు.

పారదర్శకంగా డ్వాక్రా సంఘాల కమ్యూనిటీ ఆడిట్

కంచిలి: డ్వాక్రా సంఘాల కమ్యూనిటీ ఆడిట్ కోసం అవసరమైన చర్యలను పూర్తి పారదర్శకతతో చేపట్టాలని స్థానిక ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రం కంచిలిలోని రాధాక్రిష్ణ ఆలయం ఆవరణలో ఈ మేరకు స్వయంశక్తి సంఘాలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆడిట్ కోసం అవసరమైన డ్యాక్యుమెంటేషన్‌ను ఎలా చేయాలనేది అవగాహన కల్పించారు. మండలంలో 1619 సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటి ద్వారా ప్రతి సభ్యురాలు నెలకు రూ. 100 నుంచి 150 రూపాయల వరకు పొదుపు చేసుకుంటూ సుమారు రూ.25 కోట్ల కార్పస్ నిధులు జమచేశారన్నారు. వాటి ద్వారా అంతర్గత అప్పులు తీసుకోవడంతోపాటు బ్యాంకు లింకేజీ ఉన్నతి, సీఐఎఫ్, శ్రీనిధి, సీడ్ క్యాపిటల్, ఇంకా వివిధ రకాల వ్యక్తిగత రుణాలు సంఘ సభ్యులు తీసుకొని జీవనోపాధుల కార్యక్రమాలకు ఉపయోగించుకొని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. లావాదేవీలన్నింటికీ ఏటా ఆడిట్ చేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. సమావేశంలో సిబ్బంది బి.పాపారావు, రాణి, ధనలక్ష్మి, ప్రమీల, వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

కల్యాణ మండపం నిర్మాణం నిలుపుదల చేయాలి

- జెడ్పీటీసీ సభ్యురాలు యశోద

సోంపేట: సోంపేట పట్టణంలోని శివసాయినగర్‌లో ఎటువంటి అనుమతుల్లేకుండా నిర్మాణం చేపడుతున్న కల్యాణ మండపం పనులు నిలుపుదల చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద కోరారు. ఈ మేరకు టెక్కలి డీఎల్‌పీవో గోపిబాలను సోంపేట పంచాయతీ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివసాయినగర్‌లో 178–1 సర్వేనంబర్‌లో నిర్మాణం చేపడుతున్న కల్యాణ మండపం, లాడ్జికి పంచాయతీ, సుడా అనుమతులు లేవన్నారు. కల్యాణ మండపం నిర్మిస్తున్న స్థలం వ్యవసాయ భూమిగానే ప్రస్తుత రికార్డులో నమోదై ఉందన్నారు. గతంలో ఈ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, పంటకాలువ కప్పి ఉందని.. తొలగించమని గతంలో డీఎల్‌పీవో ఆదేశాలుజారీ చేసినప్పటికీ పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కళ్యాణ మండపం నిర్మాణానికి ఇచ్చిన తీర్మాణ కాపీలు తప్పుడువన్నారు. ప్రభుత్వాన్ని, అధికారులను తప్పుదోవ పట్టించి మోసం చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలు నిలుపుదల చేసి.. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో తెలియజేశారు.



డీఎల్‌పీవోకు వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద, సర్పంచ్ జోగారావు

చైతన్యంతోనే మూఢనమ్మకాలకు ముగింపు

టెక్కలి రూరల్: చైతన్యంతోనే మూఢనమ్మకాలకు ముగింపు ఇవ్వొచ్చని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బోడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. మూఢ నమ్మకాలను అరికట్టేందుకు జేవీవీ కృషి చేస్తుందన్నారు. కోటబొమ్మాళి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డబ్బీరు గోవిందరావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల పోటీ పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కనబర్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు ఉన్నారు.

బీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



కవిటి మండల బహుజన టీచర్స్ అసోసియేషన్–2025 క్యాలెండర్‌ను బుధవారం ఎంఈవో ధనంజయమజ్జి ఆవిష్కరించారు. కవిటి మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామారావు, చలపతి, బాగా తులసయ్య పాల్గొన్నారు. –కవిటి

గిడుగుకు ఘన నివాళి



వ్యవహారిక భాషా ఉద్యమ పితామహునిగా తెలుగు భాషా అభ్యుదయానికి గిడుగు రామ్మూర్తి పంతులు అందించిన సేవలు అనిర్వచనీయమైనవని హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిడుగు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పీఎంసీ చైర్మన్ తెప్పల మోహన్, హెచ్ఎం మల్లేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రామ్మూర్తి పంతులు సేవలను తెలుగు ఉపాధ్యాయులు పీబీకే శర్మ, నేతేటి ఏకాంబరేశ్వర శర్మ విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు పాల్లాయి వాసుదేవరావు, కె.జానకీరావు పాల్గొన్నారు. –కవిటి

ఘనంగా సీతారామ కల్యాణం



టెక్కలి మండలం రావివలస గ్రామంలో సీతారామ కల్యాణం, ఆంజనేయ, సువర్చల కల్యాణ ఘట్టాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏటా సంక్రాంతి అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గ్రామ సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు ఎస్.సుధాకర్, కె.బాలకృష్ణ, ఎ.విష్ణు, ఎ.లోకనాథం పాల్గొన్నారు. –టెక్కలి

చైర్‌పర్సన్ పరామర్శ



సోంపేట పట్టణానికి చెందిన టైలర్ సంఘ అధ్యక్షుడు పొందూరు గంగారావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బుధవారం గంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే ఉప్పలాం పంచాయతీ బట్టిగళ్లూరు గ్రామానికి చెందిన మైలిపల్లి బలరాం చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, ధర్మారావు, పార్టీ నాయకులు బి.కామేశ్వరరావు, సిసింద్రీ, ఉదయ్‌కుమార్, డిల్లీరావు, లోకనాథం, ఈశ్వరరావు, సింహాచలం,పోలయ్య, నరేంద్ర ఉన్నారు. –సోంపేట